కాలుష్యపు కోరల్లో పంట కాలువ

- ఆయుష్షు కోల్పోతున్న రెండు వేల ఎకరాల ఆయకట్టు
- పంట కాలువలను చేర్చి రొయ్యలు, చేపల చెరువులు
- సెలనిటీతో పసర్లు తేరుతున్న కాలువ నీరు
- లబోదిబోమంటున్న రైతులు


చినకాపవరం లాకుల నుంచి ఆరు కిలో మీటర్లు ప్రవహిస్తున్న నావాల పంట కాలువ

ఆకివీడు: రొయ్యల చెరువుల సెలనిటీ నీరు, చేపల చెరువుల్లోని ప్లాంక్టన్, ఇతర మందులతో నిండిన వ్యర్థ నీరు పంట కాలువలోకి చొచ్చుకొచ్చి పంట భూములను నిర్వీర్యం చేస్తున్నాయని పలువురు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చినకాపవరం లాకుల వద్ద నుంచి ఆరు కిలో మీటర్ల మేర ప్రవహించే నావాల పంట కాల్వ అడుగడుగునా కలుషిత నీటికి గురవుతుంది. వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి మీడియం పంట కాలువగా ఉన్న నావాల కాలువ కాలుష్య కదంబహస్తాల్లో కొట్టుమిట్టాడుతోంది. కాలువ గట్లకు చేర్చి రొయ్యల, చేపల చెరువులు తవ్వేశారు. సీపేజ్ బోదెలు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వడంతో పంట పొలాలకు ఆయుషు తీరినట్లవుతుందని రైతులు లోబదిబోమంటున్నారు. ఇప్పటికే సెలనిటీ ప్రభావంతో దిగుబడులు తగ్గిపోతున్నాయని, రానున్న కొద్ది రోజుల్లోనే చౌడు భూములుగా మారిపోతాయన్న ఆందోళనను రైతులు వ్యక్తంయ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా కౌలుకు సాగు చేస్తూ రైతులు వందలాది మంది జీవనోపాధి పొందుతున్నారు. చెరువులు కూడా లీజులు తీసుకొని సాగు చేస్తున్నారని యజమానులెవ్వరూ లేరని వారు తెలిపారు. కౌలుకు సాగు చేస్తూ వర్షాకాలంలో ముంపుకు, రబీ సాగులో సెలనిటీ నీటితో ఇక్కట్లకు గురవుతున్నామని, సుమారు రెండు వేల ఎకరాల వరి సాగు ఈ ప్రాంతంలో మాత్రమే ఉందని వారు తెలిపారు. పట్టించుకోని అధికారులు, పాలకులు నావాల కోడు రైతుల గోడు వినే నాథుడు లేడని రైతులు వాపోతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులకు చెబితే మొక్కుబడిగా వచ్చి, కాలువ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోతున్నారన్నారు. పాలకులకు ఎన్ని సార్లు విన్నవించినా తమ కాలువ వైపు కన్నెత్తి చూడలేదంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అసమర్థత వలన రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో వరి సాగు కన్పించకుండా పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నావాల పంట కాలువ కలుషితంపై స్పందనలో అనేక సార్లు ఫిర్యాదు చేశామన్నారు. కాలువ వెంబడి నీటి సంఘం అధ్యక్షుడికి 100 ఎకరాల చెరువులున్నాయని, అయినప్పటికీ ఆయన దీనిపై శ్రద్ధ కనబర్చడం లేదంటున్నారు.

కాలువల నిండా అనధికార తూరలే

పంట కాల్వకు ఇరువైపులా చేపలు, రొయ్యల చెరువుదారులు అనధికార తూరలతో నీటిని తోడేయడమే కాకుండా చెరువుల్లోని వ్యర్థ నీటిని కాలువలోకి వదిలి వేస్తున్నారు. వందలాదిగా అనధికార తూరలున్నప్పటికీ చర్యలు లేవని ఆవేదన చెందుతున్నారు. వచ్చే మే నెలలో కాలువ చూస్తే ఆకుపచ్చ రంగులో నీరు ప్రవహిస్తుందని రైతులు తెలిపారు. 24 గంటలు, 365 రోజులూ కాలువలో కలుషిత నీరు ఉంటుందని చెప్పారు. అప్పుడప్పుడు పంట కాలువలకు వదిలిన నీరు వచ్చినప్పుడు వెంటనే చేలల్లో నింపాల్సి వస్తుందన్నారు. ఆ నీరు కూడా రెండు రోజులు ఉంటే కలుషితమైపోతుందని వాపోతున్నారు.

నోటీసులు ఏమయ్యాయో

పంట కాలువకు చేర్చి చెరువు గట్లను తొలగించాలని ఇటీవల నీటి పారుదల శాఖ అధికారులు జారీ చేసినప్పటికీ చర్యలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ముసుగులో రైతులకు న్యాయం చేయడం లేదని ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని రైతులు చెబుతున్నారు.

రైతుల మొర ఆలకించరా



నావాల కోడు పంట కాలువ కలుషితంపై అనేక సార్లు ఫిర్యాదు చేశామన్నారు. నీటిపారుదల శాఖ ఏఈ ఫణి శంకర్ వచ్చి వెళ్లిపోయారు. ఏ చర్య తీసుకోలేదు. స్పందనలో ఫిర్యాదు చేశాం. జిల్లా కలెక్టర్ కూడా స్పందించ లేదు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతాం. చర్యలు తీసుకోకపోతే సీఎం దృష్టికి తీసుకెళతాం.

–మోహన్, కౌలు రైతు, సమతానగర్, ఆకివీడు

క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్మెంట్ చట్టానికి లోబడి పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. స్కానింగ్ సెంటర్లు ఏపీ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులను గాని, క్లినిక్స్, ల్యాబ్‌లను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల ఫైర్ అనుమతి పత్రాల గడువు మించితే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ


దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేస్తున్న దాతలు

భీమవరం: అంబేడ్కర్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గుంటి ప్రభు అధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దివ్యాంగుడికి శుక్రవారం ట్రై సైకిల్ అందజేశారు. స్థానిక 21వ వార్డులో గునుపూడికి చెందిన గోగుల మండ డేవిడ్ రాజుకు దాతలు పి.చిన్నారి, కె.ఝాన్సీరాణి సౌజన్యంతో రూ.10 వేల విలువ చేసే ట్రై సైకిల్‌ను మేడిది జాన్సన్, ఎండీ నౌషద్ చేతుల మీదుగా అందించారు.

అయ్యప్పకు ప్రత్యేక అభిషేకాలు

వీరవాసరం: రాయకుదురు అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప స్వామి వారి శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం అంతా మారుమోగిపోయింది. కార్యక్రమంలో గుత్తుల బ్రహ్మం స్వామి, వంగా నాగేశ్వరరావు స్వామి, పోలిశెట్టి శివన్నారాయణ, అడ్డాల శ్రీరామ్ చంద్ర మూర్తి, జవ్వాది అప్పారావు, ముచ్చర్ల మోహన్‌సాయి, ముచ్చర్ల యశ్వంత్, మారెళ్ల బాల్య సూర్యప్రకాష్, రేలంగి వెంకటేశ్వరరావు, మారెళ్ల రమేష్, భక్తులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో రైతులకు ఆన్‌లైన్ సేవలు

భీమవరం అర్బన్: 20 ఏళ్ల పోరాట ఫలితంగా ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టిందని సహకార సంఘాల ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి నందమూరి సుబ్బారావు అన్నారు. మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏపీ సహకార ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి నందమూరి సుబ్బారావు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడూతూ తాడేరు సొసైటీ, ఎల్‌జీ పాడు, కొమరాడ సొసైటీలు పూర్తి స్థాయిలో కంప్యూటరైజేషన్ పూర్తయిందన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ వల్ల రైతులకు మెరుగైన సేవలు అందించొచ్చన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై కేసు నమోదు

భీమవరం అర్బన్: స్థానిక కొవ్వాడ అన్నవరంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉన్నం స్వర్ణకుమారి (19) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గురువారం ఆమె కాలేజీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, ఆమె తల్లి ఉన్నం రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వై.సత్యనారాయణ తెలిపారు. గతంలో కాలుకు గాయమై తీవ్ర నొప్పితో బాధపడుతున్న తమ కుమార్తె ఆ నొప్పికి తాళలేక క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఏఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భీమవరం: ఒకటో పట్టణంలోని పై వంతెనపై ఇటీవల రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పి.బాలసుందర్ (22) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ ఎం.నాగరాజు తెలిపారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన బాలసుందర్ హాల్ టిక్కెట్ కోసం ఈ నెల 5న భీమవరం వస్తుండగా పాలకొల్లు వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఆ సమయంలో రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మకు పట్టణానికి చెందిన కె.రాంబాబు, సునీత దంపతులు 8 గ్రాముల బంగారం, జడ్డు పవన్‌కుమార్ 4 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వీరికి పూజలు నిర్వహించి ప్రసాదాలు శేషవస్త్రం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

రైల్వే వారోత్సవాలు ప్రారంభం

భీమవరం(ప్రకాశంచౌక్): విజ్ఞాన వేదిక, జంక్షన్ రైల్వే స్టేషన్ ఆధ్వర్యంలో స్టేషన్ హెల్త్ యూనిట్ ప్రాంగణంలో రైల్వే వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. రైల్వే హాస్పిటల్ డాక్టర్ రమేష్, ఎస్ఎం చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రైల్వే వ్యవస్థ చాలా గొప్పదని, ఆర్థికపరంగా ఉపాధిపరంగా ఎంతో అభివృద్ధి పథంలో ఉందన్నారు. 33 ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థలతో పాటు కలిసి వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు రైల్వేశాఖ సహకారంతో వారోత్సవాలు నిర్వహిస్తామని, ముగింపు రోజున డివిజన్ రైల్వే అధికారులకు, ఉత్తమ సేవాతాత్పరులకు సత్కారాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్‌కే చాన్‌భాషా, రైల్వే యూనియన్ నాయకులు సంధి విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఏడుకొండలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

13న ఆక్వా రైతుల సమావేశం

వీరవాసరం: ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఈ నెల 13వ తేదీన ఆక్వా రైతుల సమావేశం నిర్వహిస్తామని వీరవాసరం మండల రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్ల తులసి రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో రొయ్యల ధరల స్థిరీకరణ, ముడి సరుకులు రేట్లు తగ్గిన మేత రేట్లు తగ్గించకపోవడం, జోన్లకు సంబంధం లేకుండా 1.50 పైసలకే విద్యుత్ సరఫరా చేయడం, 45 రోజులు క్రాప్ హాలిడేపై చర్చిస్తామన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని, రైతుల ఐక్యతను చాటాలని రాంబాబు పిలుపునిచ్చారు.

నిమ్న జాతుల వెలుగు జ్యోతిబా పూలే


భీమవరం: ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది


భీమవరం (ప్రకాశంచౌక్): జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహిస్తున్న బీసీ సంఘ నాయకులు


ఆకివీడు: వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహిస్తున్న సిబ్బంది


ఉండి: పాందువ్వలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు


భీమవరం: జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: నిమ్న జాతుల్లో వెలుగులు నింపిన జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని ఏపీ ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో చాంద్ భాషా, దండు శ్రీనివాసరాజు ఎస్ఎస్ఎస్ పాల్, ఏయూ భాస్కరరావు, టి సూర్యనారాయణ, కే చంద్ర రావు ,ముత్యాలరావు, వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

భారతీయ సామాజిక విప్లవ పితామహుడు పూలే

భారతీయ సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు గోవిందరావు పూలే అని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన అన్నారు. స్థానిక ఆర్‌ఆర్ డీ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి బాపూలే జయంతి ఘనంగా నిర్వహించారు.

విద్యా ప్రోత్సాహకుడు పూలే

విద్య యొక్క గొప్పదనాన్ని గుర్తించి మహిళలను ప్రోత్సహించిన జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ గోపి మూర్తి అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా యూటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయంలో నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

భీమవరం (ప్రకాశంచౌక్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే అని ఆల్ ఇండియా బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరమామిడి గంగారామ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మోజు కన్నబాబు, దొమ్మేటి వేణుగోపాలం, బి.భూలోకం, మామిడిశెట్టి త్రినాథ్, కె.వాసు, వి.గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

ఆకివీడు: సంఘ సంస్కర్త జ్యోతిరావ్ పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని రుగ్మతలపై పోరాడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ కే.ఆనందకుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే పూలే ఆశయం.

ఉండి: సమ సమాస్థాపనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని కేవీపీఎస్ నాయకుడు మాదాసి గోపీ అన్నారు. పూలే 198వ జయంతిని పురస్కరించుకుని పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది సత్యవతి,అనురాధ,సుప్రియ,రాజేశ్వరి,దుర్గ,ఎం ప్రశాంతి,చిట్టిబాబు,దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే పోరాటం అనుసరణీయం

భీమవరం: మహిళల విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అతని పోరాటం అనుసరణీయమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. శుక్రవారం భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశెంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ


అంగన్‌వాడీలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం, పాలకోడేరు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాల దేవి శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్వాడి పిల్లలకు పెట్టే ఆహార పదార్థాలు ఏ విధంగా ఉన్నాయని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్వాడి సిబ్బంది నేర్పించే విద్య పద్ధతిని చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి, సీడీపీఓ వాణి విజయరత్నం, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సూర్యకుమారి, పార్వతి అంగనవాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి


చెరువును తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి

కాళ్ల: కోలనపల్లి ఆర్అండ్‌బీ రహదారి చెరువులను తలపిస్తుంది. కాళ్ల నుంచి కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి కోలనపల్లి వరకు రహదారి వేసి అక్కడి నుంచి కుప్పనపూడి వరకు రహదారి మరమత్తు చేయకుండా వదిలేయడంతో రహదారి పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే గురువారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి రహదారి వర్షపునీరు నిలిచి చెరువులా మారింది. రహదారిపై నిలిచిన నీటిని మళ్లించి మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం


ఆకివీడు: కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డెబోర మోసియానా


వీరవాసరం: రాయకుదురులో కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


కాళ్ల: ఏలూరుపాడు అంగన్వాడీ కేంద్రంలో తల్లులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది


పాలకోడేరు: పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆకివీడు: ఆరోగ్యవంతమైన సమాజం కోసం పోషన్ పట్వాడా కార్యక్రమం దోహదపడుతుందని ప్రముఖ శాస్త్రవేత్త డెబోర మోసియానా చెప్పారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం పోషన్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మోసియానా మాట్లాడుతూ కిషోర బాలికలు, గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి, నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, హెల్త్ విజిటర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.

రాయకుదురులో పోషణ పక్వాడా

వీరవాసరం: పోషణ పక్వాడాలో భాగంగా రాయకుదురు గ్రామంలో శుక్రవారం 1000 రోజుల సంరక్షణలో భాగంగా కేవలం తల్లిపాలు మాత్రమే మరియు అనుబంధ పోషకాహారం కొనసాగింపు, ఆహారంలో వైవిధ్యం మొదలగు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు భీమవరం సి డి పి ఓ టి కే వి లక్ష్మీ కాంతం మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్వతీ, మేరీ ,లక్ష్మి , అన్నపూర్ణ, రోజా, శ్రావణి పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ పక్వాడా

పాలకోడేరు: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏప్రిల్ 8 నుంచి 22 వరకు పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వేండ్ర, కొండేపూడి, పాలకోడేరు, శృంగవృక్షం, మోగల్లు గ్రామాల్లో కిషోర బాలికలు, గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వాణి విజయరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతీ, సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాళ్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష నిర్వహణ


మోడల్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

భీమవరం: ఈ నెల 19వ తేదీన నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల నిమిత్తం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. డీఎన్ఆర్ లా కళాశాలలో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు 37 మంది న్యాయవాదులు, విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్ న్యాయవాదులకు, ఫైనల్ లా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపల్ కె.రఘురాం, చెల్లబోయిన రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి యోహాను, ఎం భాస్కర్ రావు, ఎం చిత్రబాను, ఎం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చివరిలో ఫలితం దక్కేనా ?


సీసలిలో వరిచేలలో నీరు ఇంజన్ తో బయటకు తోడుతున్న రైతులు

కాళ్ల: ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వాతావరణంలో వచ్చిన మార్పులతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి రైతన్నకు నిద్ర కరువైంది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో రైతులు పండించిన పంటను కాపాడుకునేందుకు పొలాలబాట పట్టారు. మండలంలోని కాళ్ల, సీసలి, జక్కరం, కోపల్లె, కోమటిగుంట తదితర గ్రామాల్లో వరిపంటను కోత మిషన్లతో సాయంతో కోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కళ్లాల్లోని ధాన్యాన్ని పట్టుబడి పట్టడంతో పాటు, రోడ్డు మార్జిన్ల వెంబడి ఆరబెడుతున్నారు. సీసలి గ్రామంలో ఇంకా కోతలుకోయని వరిచేలల్లో భారీ వర్షం కారణంగా నీరు చేరింది. ఆయిల్ ఇంజన్ల సహాయంతో నీటిని బయటకు తోడుకుంటూ పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.